ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024

ఆదిపరాశక్తిగా చౌడేశ్వరీమాత



సోమందేపల్లిలో బోనాలు మోసుకొస్తున్న మహిళలు, గోరంట్లలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా అమ్మవారి జయంతి


బోనాలు సమర్పించిన మహిళలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 4: శ్రీ చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాలను ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లి ఆలయంలో అమ్మవారు ఆదిపరాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మవరంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముద్దిరెడ్డిపల్లిలో తెల్లవారుజామున 5 గంటలకు మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, 7 గంటలకు కలశార్చన, హోమాలు, చండీయాగం, గోపూజ, సుహాసినీ పూజ చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగుతూ వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌ను వెండి నగలతో ఆదిపరాశక్తిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, అర్చకుడు శేషగిరిరావు పాల్గొన్నారు. కొటిపిలో అమ్మవారి మూల విరాట్‌ను పూలు, నగలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ధర్మవరంలోని పార్థసారధినగర్‌లో వెలసిన చౌడేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. సోమందేపల్లిలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు. గోరంట్లలో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.


ముద్దిరెడ్డిపల్లిలో చౌడేశ్వరీదేవికి వెండి నగలతో ఆదిపరాశక్తి అలంకరణ

సతుల్లేవ్ వసూళ్లే!

మార్కెట్ యార్డుల్లో సదుపాయాలేవీ?

బురదమయంగా హిందూపురం మార్కెట్


రైతు సేవలకు నిర్దేశించిన వ్యవసాయ మార్కెట్ యార్డులు కేవలం రుసుం వసూలు కేంద్రాలుగా మారాయి. పంట ఉత్పత్తులకు గిట్టుబాట ధర కల్పించే ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయాన్ని నివారించాల్సిన మార్డులు రైతులకు దూరమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం, పాలకవర్గాల నిర్ణయాలతో యార్డుల నిధులు పక్కాదారి పట్టగా.. రైతన్నకు ప్రయోజనం శూన్యమైంది. యార్డుల్లో అన్నదాతలకు మౌలిక సదుపాయాలతోపాటు రైతుబంధు పథకాన్ని అమలుచేయకపోవడంతో వసూళ్లకు పరిమితం.. సేవలకు రాంరాం అన్నచందంగా జిల్లాలోని మార్కుట్ యార్డులు మారాయి.

– ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

ఆదాయమే లక్ష్యంగా..

జిల్లాలో ఎనిమిది వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. వీటిలో దేశంలోనే అతిపెద్ద చింత పండు మార్కెట్ యార్డుగా హిందూపురం పేరొందింది. ఎనిమిది మార్కెట్ యార్డుల నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.22 కోట్ల రుసుం వసూలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5.9 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం యార్డుల ఖజానాలో రూ.7.3 కోట్లు మూలుగుతున్నాయి. ఏఎంసీ గోదాముల అద్దెతోపాటు గొర్రెలు, పశువుల వారపు సంతల నుంచి ఆదాయం సమకూరుతోంది. మొక్కజొన్న, వేరుశనగ, ధాన్యం తదితర పంట ఉత్పత్తుల ద్వారా సేకరించిన రుసుం నుంచి తిరిగి రైతులకు చేయాల్సిన మేలును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. గిట్టుబాటు ధర లేనపుడు వడ్డీలేని రుణమిచ్చి రైతన్నను ఆదుకునే రైతుబంధు పథకాన్ని అమలు చేయలేదు. 2014-19లో టీడీపీ హయాంలో మార్కెట్ యార్డుల అభివృద్ధితోపాటు రైతుబంధు పథకం కేటాయింపులు జరిగేవి. రైతులకు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం రాబడికి తగ్గట్టుగా మార్కెట్ యార్డుల్లో రైతు ప్రయోజనాలకు కేటాయింపులు విస్మరించింది. ప్రతి మార్కెట్ పరిధిలో రైతు శిక్షణ, పశు వైద్యం, రైతు ఆరోగ్య శిబిరాల ఊసేలేదు. పొలాల నుంచి ప్రధాన రహదారులకు కలిపే మట్టి రోడ్డు ప్రతిపాదనలే లేవు. నిధులను పక్కదారి పట్టించి, పంచాయతీరాజ్ శాఖకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2022లో మార్కెటింగ్ శాఖ జిల్లాలో 87.42 కోట్లతో సహకరించారు. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులే మొదలవలేదు. ఏటా మార్కెట్ రుసుం వసూలుపై ఉన్న శ్రద్ధ.. రైతన్నకు సదుపాయాల కల్పనపై లేదన్నది బహిరంగ రహస్యమే.

మార్కెట్ యార్డు	ఖజానా నిల్వ (రూ.ల్లో..)
ధర్మవరం	53.57 లక్షలు
గోరంట్ల	31.63 లక్షలు
హిందూపురం	1.18 కోట్లు
కదిరి	41.95 లక్షలు
మడకశిర	25.42 లక్షలు
పెనుకొండ	1.43 లక్షలు
పుట్టపర్తి	4.31 కోట్లు
తనకల్లు	3 వేలు

వసతులపై దృష్టి ఏదీ?

జిల్లాలో హిందూపురం, మడకశిర, కదిరి, పెనుకొండ, ధర్మవరం, గోరంట్ల, తనకల్లు, పుట్టపర్తి మార్కెట్ యార్డులున్నాయి. హిందూపురం మార్కుట్ నుంచి భారీగా ఆదాయం వస్తోంది. తరువాత కదిరి, కొత్తచెరువు, గోరంట్ల మార్కెట్ యార్డుల్లో వారపు గొర్రెలు, పశువుల సంతలతో భారీగా ఆదాయం వస్తోంది. జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులు పెట్టి పంట ఉత్పత్తుల రవాణాపై రుసుం వసూలు చేస్తున్నారు. మిగిలిన పెనుకొండ, మడకశిర, ధర్మవరం, తనకల్లు యార్డుల్లో పంట ఉత్పత్తులతోపాటు మార్కెట్ యార్డుల్లో అద్దెల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఇందులో హిందూపురం మార్కెట్ యార్డులో తాగునీరు, మరుగుదొడ్లు, రైతులకు విశ్రాంతి గదులు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. వర్షాకాలంలో యార్డులో నీరు చేరి మిర్చి, చింతపండును నిల్వ చేయడం కష్టంగా మారుతోంది. జిల్లాలోని యార్డుల్లో శీతల గిడ్డంగులు లేవేజ మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోతే నిల్వ ఉంచడానికి వీలులేక వచ్చిన కాడికి విక్రయించాల్సి వస్తోంది. యార్డుల్లో రైతులు, కూలీలు, వ్యాపారులకు సబ్సిడీతో అల్పాహారం, భోజనం అందించట్లేదు. యార్డుల్లోని క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం లభించకపోయినా.. గత్యంతరలేక తినాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గోరంట్ల, కొత్తచెరువు, కదిరి మార్కెట్ యార్డుల్లో గొర్రెలు, పశువుల సంతల్లో ఐదేళ్లుగా పాలకవర్గాలు, యార్డు సిబ్బంది కుమ్మక్కై ఇష్టారాజ్యంగా రుసుం వసూలు చేసి, ప్రతి వారం లక్షల్లో నొక్కేశారు. మార్కెటింగ్ అధికారులు.. యార్డులపై పర్యవేక్షణ విస్మరించడంతో రుసుం వసూళ్ల పక్కదారి పట్టాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనను మరచి, ఆదాయంపై దృష్టిసారించడం విమర్శలకు తావిస్తోంది.

పేరుకే ఆదర్శ మార్కెట్ యార్డు


ప్రహరీ కూలి ఏళ్లు గడిచినా చేపట్టని నిర్మాణం

దేశంలో చింతపండు, మిర్చి కొనుగోళ్లలో పెద్ద మార్కెట్‌గా హిందూపురం యార్డు గుర్తింపు పొందింది. ఏడాది పొడవునా యార్డుకు రైతులు ఉత్పత్తులను తీసుకొస్తుంటారు. దీంతో ఏటా సగటున రూ.2కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. దీంతో జిల్లాలోని మార్కెట్ యార్డులకే రుణం ఇస్తూ ఆదర్శ మార్కెట్ యార్డు జాబితాలోకి చేరింది. ఇలాంటి మార్కెట్ యార్డులో రైతులకు కనీస సదుపాయాలు కరువయ్యాయి. వారికి సేవలు నామమాత్రంగా మారాయి. దశాబ్దాలుగా హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లాతోపాటు కర్ణాటక ప్రాంతం నుంచి రైతులు, చిన్న వ్యాపారులు వచ్చి చింతపడు, మిర్చి, మొక్కజొన్న దిగుబడులను విక్రయిస్తున్నారు. యార్డుకు వచ్చిన ఉత్పత్తులను స్థానిక వ్యాపారులతోపాటు దేశంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో సగటున ఏడాదికి రూ.500 కోట్ల వ్యాపారాలు కొనసాగుతాయి. చింతపండు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. హమాలీలతోపాటు కూలీలు కూడా వేయిమందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఏటా యార్డుకు వచ్చే విపరీతంగా పెరుగుతున్నా.. సదుపాయాలు మాత్రం మెరుగుపడలేదు. మార్కెటింగ్ అధికారులు ప్రతిసారీ రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించి, రైతు సేవాకేంద్రాలుగా యార్డును అభివృద్ధి చేస్తున్నట్లు హామీలు గుప్పిస్తున్నారు. ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంపై రైతన్నలు ఆవేదన చెందున్నారు.

అలరించిన ప్రేమబాటలో మణిదీపాలు


నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి: బాలవికాస్ చిన్నాలు ప్రేమబాటలో మణిదీపాలు పేరిట ప్రదర్శించిన నృత్యం భక్తులను అలరింపజేసింది. తూర్పుగోదావరి జిల్లా భక్తులు రెండోరోజు ఆదివారం సాయంత్రం స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించారు. బాలవికాస్ చిన్నారుల మధురగానం, భక్తులు మైమరచిపోయారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

కట్టారు.. వదిలేశారు..!


నూతన కార్యాలయం లోపలి భాగం

తాడిమర్రి, ఆగస్టు 4: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని నిర్మించినా.. వినియోగంలోకి తీసుకురాలేదు. గత వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా తహసీల్దార్ కార్యాలయం పాత భవనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనాన్ని 2005లో ప్రారంభించారు. అప్పట్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో పైకప్పు పెచ్చులూడి పడిపోతోంది. రికార్డులు కూడా ఎక్కువగా ఉండటంతో గదులన్నీ నిండిపోయాయి. నూతన కార్యాలయాన్ని రూ.50లక్షలతో నిర్మించడానికి 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. రెండేళ్లలోపే దాదాపు పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక నూతన భవనం ఊసే మరిచారు. పాత కార్యాలయంలో వర్షానికి నీరు కారి, రికార్డులు తడిసిపోయే ప్రమాదం ఉంది. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఇప్పటికే నూతన కార్యాలయాన్ని ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

10న జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీ

ధర్మవరం, ఆగస్టు 4: స్థానిక కాకతీయ విద్యానికేతన్‌లో ఈనెల 10వతేదీన జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. యూటీఎఫ్ స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతుండడంతో స్వర్ణోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే పాల్గొనాలన్నారు. సొంత చెస్ కిట్టుతో హాజరు కావాలన్నారు. ముందస్తుగానే యూటీఎఫ్ నాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4: సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో పలువురు తహసీల్దార్లకు స్థానాలు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ పేరు	కేటాయించిన స్థానం
వెంకటనారాయణ	సూపరింటెండెంట్ కలెక్టరేట్
సురేష్‌కుమార్	సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఖాతూజాన్ కుప్రా	సూపరిండెంట్, కలెక్టరేట్
ఎస్. నాగరాజు	సూపరింటెండెంట్, కలెక్టరేట్
నాగేంద్ర	రొద్దం
అనుపమ	పుట్టపర్తి
సయ్యద్ షాబుద్దీన్	బుక్కపట్నం
జి.నాగరాజు	కొత్తచెరువు
రంగనాయకులు	నల్లమాడ
అనంతాచారి	ఓబుళదేవరచెరువు
సుబ్బులక్ష్మి	ఆర్డీఓ ఆఫీసు, ధర్మవరం
నటరాజ	ధర్మవరం
జమాలుద్దీన్ ఖాన్	రామగిరి
మురళీకృష్ణ	కదిరి
వేణుగోపాల్	గాండ్లపెంట
శ్రీధర్	పెనుకొండ
హసీనాసుల్తానా	పరిగి
సౌజన్యలక్ష్మి	లేపాక్షి
అనంద్‌కుమార్	చిలమత్తూరు
శ్రీనివాసులు	అగళి
టీఎస్ జిలానీ	రొళ్ల
స్వర్ణలత	అమరాపురం
కరుణాకర్	గుడిబండ

పేకాటకు గేట్లెత్తారు..!

మొబైల్ స్థావరాలతో రూ.కోట్లలో ఆట

బదిలీలు, బిజీ పేరుతో తప్పించుకుంటున్న ఖాకీ

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న వైనం




హిందూపురం, ఆగస్టు 4: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పోలీసు అధికారుల బదిలీల నేపథ్యంలో కొంతమంది ఖాకీలు జిల్లాలో పేకాటకు గేట్లెత్తించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మొబైల్ స్థావరాలతో పేకాట యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పేకాట రాయుళ్లకు ఓవైపు పోలీసు అధికారులు.. మరోవైపు నాయకుల అండ పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. గత వైసీపీ హయాంలో వచ్చిన కొంతమంది పోలీసు అధికారులు ఆ పార్టీ నాయకుల అండతో పేకాట ఆడిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ నాయకులతోపాటు మరికొంతమంది కూడా పేకాటను స్థావరంగా మలుచుకున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా కొత్త అధికారులు వస్తే పేకాట ఆడిస్తారో.. అరికడతారోనన్న అనుమానంతో ప్రస్తుతం ఉన్నవారు బదిలీ అయ్యేలోపు నాలుగు రూపాయలు వెనకేసుకుందామని బరితెగిస్తున్నారు. పేకాట రాయుళ్లు పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. పెనుకొండ నియోజకవర్గంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేయగా.. భారీఎత్తున నగదు పట్టుబడింది. కొంతమంది పేకాటరాయుళ్లతోపాటు నిర్వాహకులను పోలీసులు తప్పించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వెలుస్తున్న మొబైల్ స్థావరాలు

జిల్లాలో పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో రోజూ స్థావరాల్లో పేకాట నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వారేకాక పక్కనున్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పేకాటరాయుళ్లు వస్తున్నారు. దర్జాగా పేకాట ఆడి, అక్కడి నుంచి మరోచోటికి వెళ్లిపోవడం పారిశ్రామిక వాడ, సోమందేపల్లి హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లో పేకాట దర్జాగా సాగుతోంది. పెనుకొండ నియోజకవర్గంలోని పుట్టపర్తి, పెనుకొండ సరిహద్దులో పరిగి, రొద్దం మండలాల్లో విచ్చలవిడిగా పేకాట సాగుతోంది. ఇక్కడ పోలీసు అధికారులకు తెలిసినా తెలియనట్లు కినుకు వహిస్తున్నారు. మడకశిర మండలం సరిహద్దు ప్రాంతం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పేకాటను దర్జాగా ఆడిస్తున్నారు.

బదిలీలు, బిజీ అంటూ..

కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో చాలాచోట్ల సీఐలు, ఎస్ఐలు బదిలీ కానున్నారు. మరికొంతమంది పోలీసు అధికారులైతే తమకు వీఆర్ తప్పదని నిశ్చయించుకున్నారు. ఎలాగూ తమను ఇక్కడి నుంచి పంపుతారనే ఉద్దేశంతో ఈ కొన్నిరోజులు పేకాటాడేవారికి సహకరిస్తే కొంత సొమ్మయినా తీసుకెళ్లవచ్చని అత్యాశతో పేకాటకు సై అన్నట్లు సమాచారం. హిందూపురం నియోజకవర్గంలో ఇద్దరు పోలీసు అధికారులు వారానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది పేకాటరాయుళ్లే.. పోలీసు అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరించారని చర్చ సాగుతోంది. ఇటీవల ఒక పోలీసు అధికారిని హిందూపురానికి తీసుకొచ్చేందుకు పేకాటరాయుళ్లే తీవ్ర ప్రయత్నం చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రజాప్రతినిధులు అడిగినంత ఇస్తామనీ, సదరు అధికారికి అవకాశం కల్పించాలని కోరారట. సదరు ప్రజాప్రతినిధి.. అధికారికి చీవాట్లు పెట్టి పంపించారు. మరో పోలీసు అధికారైతే రూ.లక్షల్లో ఇస్తామనీ, తనకు అవకాశం కల్పించాలని కోరారు. అతడిని వెంటనే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఒత్తిడి తెచ్చారు. పక్క నియోజకవర్గంలోని ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అక్కడికి రావడానికి ఒత్తిడి చేసి రప్పించుకున్నట్లు తెలుస్తుంది. కొంతమంది వైసీపీ నాయకులకు అనుకూలంగా ఉన్న పోలీసు అధికారులు మాత్రం రాలినంతా రాలనీ అని పేకాట ఆడిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇందుకు పట్టుబడుతున్న స్థావరాలే నిదర్శనం.

చూసీచూడనట్లు..

జిల్లాలో పెద్దఎత్తున పేకాట ఆడుతున్నట్లు పోలీసు అధికారులకు తెలిసినా వారు మౌనం వహిస్తుండటం గమనార్హం. ఇటీవల ఓ నియోజకవర్గంలో పేకాట నిర్వాహకులను పట్టుకునేందుకు వెళ్లగా పోలీసు అధికారికి పై స్థాయి అధికారి నుంచి చీవాట్లు పడ్డాయి. దీంతో కిందిస్థాయి అధికారికి తల తిరిగినట్లయింది. చేసేదిలేక అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. పేకాట రాయుళ్లను పట్టుకుంటున్నారుతప్ప.. నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. ఏది ఏమైనా ఉన్నతాధికారులు.. పేకాట నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే పేద, మధ్యతరగతి కుటుంబాలు బజారునపడాల్సి వస్తుంది.

పేకాట నిర్వాహకులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

జిల్లాలో పేకాట నిర్వాహకులను గుర్తిస్తున్నాం. వారిపై త్వరలోనే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. ఇప్పటికే నిర్వాహకులను హెచ్చరించాం. మార్పురానివారిపై దృష్టి పెడతాం. జిల్లాలో డీఎస్పీ, సీఐల బదిలీలు పూర్తయ్యాక గంజాయి, పేకాట, మట్కా ఇతర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. పేకాట ఆడించేవారు వెంటనే మానుకోవాలి. లేదంటే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. మారిన చట్టాలకు అనుగుణంగా వారిపై చర్యలు ఉంటాయి. పేకాట నిర్వహణలో పోలీసు సిబ్బంది పాత్ర ఉంటే అలాంటివారిని గుర్తించి ఇళ్లకు పంపుతాం.

– రత్న, జిల్లా ఎస్పీ

ప్రభుత్వం.. రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి శైలజానాథ్



మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం.. జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వేరుశనగ పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. రైతులను ఆదుకొనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. వైసీపీ హయాంలో రైతులను ఆదుకోవడానికి ఏ ఒక్క ప్రయత్నం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం ఇవ్వలేదనీ, సబ్సిడీ పరికరాల ఊసేలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలన్నారు. నీటి సమస్యపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు.. సమస్యలను ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు రామ్‌చరణ్‌యాదవ్, ఆంజనేయులు, శర్మాస్ వలి, ఇంద్రావతి, మురళి, కవిత పాల్గొన్నారు.


కేరళ, తమిళనాడు జట్ల విజయం



తమిళనాడు, గుజరాత్ జట్ల మధ్య మ్యాచ్‌కు టాస్ వేస్తున్న అంపైర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో కేరళ, తమిళనాడు జట్లు విజయం సాధించాయి. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో రెండోరోజు ఆదివారం కొనసాగాయి. గుజరాత్‌పై తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్‌పై కేరళ జట్లు గెలుపొందాయి. విశ్రాంత డీఎస్‌డీఓ సుధాకర్, అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ విశ్వనాథ్ చౌదరి, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డైరెక్టర్ రావూరి రాజేష్, జిల్లా కార్యదర్శి కూడేరు మల్లేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యవర్గసభ్యుడు రాజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



టీబీడ్యాం గేట్ల నుంచి విడుదలవుతున్న వరదనీరు

బొమ్మనహాళ్, ఆగస్టు 4: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 1,38,394 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరాయి. దీంతో 33 గేట్లలో 25 గేట్లను మూడున్నర అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్క అడుగు పైకి ఎత్తి 1,34,888 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,38,394 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి 1,49,250 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా శుక్రవారం సాయంత్రం నాటికి 1631.09 అడుగులతో 98.220 టీఎంసీల నీటిని నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1133 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఏసీఏ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా మాంచో ఫెర్రర్



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) త్రిసభ్య కమిటీలో జిల్లాకు చెందిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు చోటు దక్కింది. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం అమరావతి లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో త్రిసభ్య కమిటీని నియమించారు. నూతన కార్యవర్గం ఎంపిక అయ్యేవరకు త్రిసభ్య కమిటీ ఏసీఏ కార్యకలాపాలు, క్రికెట్ పోటీల నిర్వహణను పర్యవేక్షిస్తుంది.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, ఆగస్టు 4: డీఎస్సీ శిక్షణ పొందేందుకు అర్హులైన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రాం ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. డిగ్రీ-బీఈడీ, ఇంటర్-డీఈడీ, టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన ఎస్టీ అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులు అనంతపురంలోని పెన్నార్ భవన్‌లో గల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లభిస్తాయన్నారు. దరఖాస్తులను ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పెన్నార్ భవన్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన వివరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి, ఆగస్టు 4: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ముగిశాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మొత్తం 200మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజర్ సాయి తెలిపారు. ఈ పోటీల్లో మొదటిస్థానంలో విజయనగరం జిల్లా జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు, తూర్పుగోదావరి జిల్లా మూడవస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. గెలుపొందిన జట్లకు ఛాంపియన్ ట్రోఫీలను రాష్ట్ర స్థాయి తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రావు, టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున, కమలమ్మలు అందజేశారు.



సర్టిఫికెట్లను చూపుతున్న క్రీడాకారులు

మినీ గోకులాలకు శ్రీకారం..!

పునఃప్రారంభించిన కూటమి ప్రభుత్వం

పాడి రైతులకు సదవకాశం

సబ్సిడీతో నిర్మించుకునేందుకు ప్రభుత్వం సాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 4: వ్యవసాయం తరువాత పాడిపరిశ్రమపైనే రైతులు ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారు. చాలామంది రైతులు వ్యవసాయంలో నష్టాలపాలై, పాడి పరిశ్రమపైపు చూస్తున్నారు. ఇలాంటి వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2017-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. కొంతమంది ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలను నిర్మించుకున్నారు. ఎన్నికలు రావడం ఆ తరువాత వైసీపీ అధికారం చేపట్టడంతో పథకానికి పూర్తిగా స్వస్తి పలికింది. మినీ గోకులాలు నిర్మించుకున్న వారికి బిల్లులు కూడా చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈక్రమంలోనే మళ్లీ మినీ గోకులాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఆమేరకు సంబంధిత శాఖ అధికారులకు మినీగోకులాల నిర్మాణాలు చేపట్టాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇదే క్రమంలో టీడీపీ హయాంలో నిర్మించుకున్న వారి వివరాలు సేకరించాలని నిర్ణయించింది. దీంతో ఆయా వర్గాల్లో తిరిగి ఆశలు రేకెత్తుతున్నాయి.

సబ్సిడీతో ప్రభుత్వ సాయం

పాడి రైతులు జిల్లాలో మినీ గోకులాలు నిర్మాణంకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈక్రమంలోనే 1400 యూనిట్లకు పైగా మినీ గోకులం షెడ్లు కేటాయించింది. జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనుంది. అనంతపురం రూరల్ మండలంకు 50మినీగోకులం షెడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 20కిపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. గతంలో మాదిరిగానే పశుపోషకులకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70శాతం సబ్సిడీతో గోకులం షెడ్లు నిర్మించనుంది. 2018-19లో మినిగోకులం షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లు చెల్లించాలని సంబంధిత రైతులు.. అధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఆమేరకు అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది.



వివరాల బోర్డు

ఇవీ అర్హతలు..

- ఎస్సీ, ఎస్టీ, వలస, డీ-నోటిఫైడ్ తెగలవారు
- దారిద్ర రేఖకు దిగువనున్నవారు
- మహిళా యజమాని, అంగవైకల్యం యజమాని కుటుంబాలు
- భూసంస్కరణ, పీఎంఏవైజీ లబ్ధిదారులు
- అటవీ హక్కుల చట్ట-2006 లబ్ధిదారులు
- చిన్న, సన్నకారు రైతులు

జత చేయవలసిన పత్రాలు..

- అప్లికేషన్ ఫారం
- ఆధార్‌కార్డు
- జాబ్‌కార్డు
- స్థలం హక్కు పత్రం
- బ్యాంకు పాస్‌బుక్

మన్ని వివరాలకు పశువైద్యశాలలోగానీ, రైతు సేవా కేంద్రంలోగానీ సంప్రదించవచ్చు.

- 2 పశువుల మినీ గోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.1,15,000
ఉపాధి హామీ నిధులు రూ:1,03,500
రైతు వాటా రూ:11,500
- 4 పశువుల మినీగోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.1,85,000
ఉపాధి హామీ నిధులు రూ:1,66,500
రైతు వాటా రూ: 18,500
- 6 పశువుల మినీగోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.2.30లక్షలు
ఉపాధి హామీ నిధులు రూ:2.07లక్షలు
రైతు వాటా రూ: 23వేలు

గొర్రెలు, మేకలషెడ్డు వివరాలు

- 20 జీవాల షెడ్డు
యూనిట్ విలువ:రూ.1.30లక్షలు
ఉపాధి హామీ నిధులు రూ:91వేలు
రైతు వాటా రూ.39వేలు
- 50 జీవాల షెడ్డు
యూనిట్ విలువ: రూ.2.30లక్షలు
ఉపాధి హామీ నిధులు: రూ:1.61లక్షలు
రైతు వాటా: రూ.69వేలు

కోళ్ల షెడ్ వివరాలు..

- 100కోళ్ల షెడ్
యూనిట్ విలువ: రూ.87వేలు
ఉపాధి హామీ నిధులు: రూ.60,900
రైతు వాటా: రూ.26,100
- 200 కోళ్ల షెడ్
యూనిట్ విలువ: రూ.1.32లక్షలు
ఉపాధి హామీ నిధులు :రూ.92,400
రైతు వాటా: రూ.39,600



ప్రతాప్ నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డు



ఈ పాడి రైతు పేరు ప్రతాప్. అనంతపురం రూరల్ మండలం, క్రిష్ణంరెడ్డి పల్లి. తన అన్న శివయ్య పేరు మీద ఉపాధి హామీ పథకం కింద 2018-19లో మినీగోకులం షెడ్డు నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలోనే రైతు వాటా కింద రూ.20వేలు డీడీ రూపంలో చెల్లించాడు. షెడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నాడు. అయితే 2019సాధారణ ఎన్నికలు జరగడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తరువాత మినీగోకులాలకు వైసీపీ నిధులు కేటాయించలేదు. ఇప్పుడైనా ప్రభుత్వం మినీగోకులం షెడ్డు నిర్మాణానికి సంబంధించిన బిల్లు ఇస్తే మేలు చేసినట్లు అవుతుందని అంటున్నాడు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మినీగోకులం షెడ్ల నిర్మాణాలను ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. మండలానికి 50 యూనిట్లు కేటాయించారు. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే కొన్ని దరఖాస్తులు వచ్చాయి.

- శారద, పశువైద్యాధికారి, అనంతపురంరూరల్ మండలం

శ్రావణం... ఆధ్యాత్మిక పరిమళం

నెల ఆద్యంతం పండుగలే..

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు



అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: ఏదైనా నెలలో ఒకరోజో, వారమో ప్రత్యేకం ఉంటుంది. నెలలోని ప్రతి రోజూ ఓ పండుగే అంటే అది శ్రావణమాసమే. తెలుగు క్యాలెండర్ ప్రకారం ఐదవ నెలలో వచ్చేదే శ్రావణమాసం. ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలున్న మాసం. ఆదివారం నాటి అమావాస్యతో ఆషాఢమాసం సమాప్తమవగా సోమవారం నుంచి శ్రావణమాసం ఆరంభమైంది. ఈ మాసంలో శివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. హిందువులకు శ్రావణమాసం ఎంతో ప్రత్యేకం. ఈనెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. అందుకే ఈ నాలుగు వారాలలో ఆలయాలు, ఇళ్లల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. దక్షిణాయనంలో వచ్చే విశిష్ట మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. అలాగే ఈ నెలలో చేసే ఏ చిన్న దైవకార్యమైనా వేలరెట్ల శుభఫలితాలనిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి పవిత్రమైన, శక్తివంతమైన శ్రావణమాసంలో వచ్చే సోమవారాల్లో చాలామంది ఉపవాసాలుండి పరమశివుడికి అభిషేకాలు చేస్తారు. ఇలా చేయడాన్ని శ్రావణసోమవార వ్రతమని పిలుస్తుంటారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి, స్నానమాచరించి, శివాలయాన్ని సందర్శించి పాలు, నీళ్ల కలిపిన పదార్థంతో శివలింగానికి అభిషేకం చేయాలి. అభిషేకం చేస్తున్నంతసేపు నిర్విరామంగా నమఃశివాయ అంటూ స్తుతించాలి. అదేవిధంగా మంగళవారం చేసే వ్రతాలను మంగళగౌరీ వ్రతాలు అని పిలుస్తుంటారు. ఇక శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు, శనివారాల్లో విష్ణుమూర్తి అవతారమైన వెంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ ఏడుశనివారాల వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రావణమాసం చాలా విశిష్టమైంది. శ్రీకృష్ణ జన్మాష్టమి, రక్షాబంధన్, నాగపంచమి పండుగలు ఈ నెలలో వస్తాయి. అదేవిధంగా పెళ్లిళ్లకు ఈ మాసం చాలా పవిత్రమైనదిగా భావిస్తుంటారు.

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందు కోసం ప్రతియేటా అనంత ఆర్టీసీ శ్రావణ మాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శ్రావణ మాసం కూడా బస్సు సర్వీసులను నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు. ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునేందుకు రాను, పోను చార్జీలు పెద్దలకు రూ.495లు, పిల్లలకు రూ.250లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ముందస్తు రిజర్వేషన్ కూడా ఉందన్నారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం

మాసాలన్నింటిలోకెల్లా అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసమేదైనా వుందంటే అది శ్రావణమాసమే. ఈనెల 5 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శ్రావణమాసం వుంటుంది. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడం వల్ల శుభఫలితాలను పొందుతారు.

నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం



తెగిపడిన విద్యుత్ వైరు

ముదిగుబ్బలో తెగిపడ్డ విద్యుత్ వైరు

ఇద్దరు మహిళలకు గాయాలు



ముదిగుబ్బ, ఆగస్టు 4: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు తులసమ్మ తోపుడు బండిపై బఠాణీలు, కట్టకిందపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ నరసమ్మ చెక్కిలాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ఆదివారం వ్యాపారం చేసుకుంటుండగా విద్యుత్ షాట్‌సర్క్యూట్ వైరు తెగి వారి మీద పడడంతో గాయాలయ్యాయి. ముదిగుబ్బ సీఐ యతీంద్ర, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, చరణ్ మహిళలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తులసమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని లైన్‌మెనుల సమస్యలు ఉత్పన్నమైన సమయంలో స్పందించడంలేదని మండలవాసులు అంటున్నారు. విద్యుత్ అధికారులు, లైన్‌మెన్‌లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌లకు ఫోన్ చేస్తే తీయడంలేదని, సబ్‌స్టేషన్ నెంబర్ ఎప్పుడూ స్విచ్‌ఆఫ్ వస్తోందని అంటున్నారు. మండల విద్యుత్ కార్యాలయానికి శాశ్వత ఏఈ లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ముదిగుబ్బ విద్యుత్ శాఖలో పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతే తప్ప స్పందించరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, స్పందించి మండల విద్యుత్ ఏఈని నియమించాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, సూరి పరామర్శించారు.

అండర్-14 క్రికెట్ జట్టు సెలెక్షన్స్‌కు అనూహ్య స్పందన

సెలక్షన్ కమిటీలో రాజకీయ నాయకుల ప్రమేయంపై

తల్లిదండ్రుల ఆగ్రహం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో అండర్-14 బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా 229మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. అయితే సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా నగరపాలక సంస్థ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డిని నియమించడం పట్ల పలువురు క్రీడాకారుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల జోక్యంతో జిల్లాలో క్రికెట్ పతనమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సెలెక్షన్ కమిటీలో రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులను నియమిస్తేనే నైపుణ్యతగల క్రీడాకారులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని నైపుణ్యం ఉన్న క్రీడాకారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. అనంతరం క్రీడాకారుల బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్, ఫిట్‌నెస్‌ను పరిశీలించారు.

కలకలం..

ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ

కట్టర్లతో కట్ చేసి నగదు అపహరణ

కర్ణాటకలో ఇద్దరి పట్టివేత?

పరారీలో మరొకరు..

అనంతపురం క్రైం, ఆగస్టు 4: నగరంలో ఆదివారం తెల్లవారుజామున కలకలం రేగింది. రద్దీగా ఉండే.. రామ్‌నగర్ ప్రధాన రహదారిలోని ఏటీఎంలో దొంగలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే, రాత్రిపూట వాహనాలు తిరిగే ప్రాంతంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. మొహాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దర్జాగా కారులో వచ్చారు. ఒకరేమో ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. తర్వాత ముగ్గురూ కలిసి కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, అందులోని రూ.29.81 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ మొత్తం తతంగాన్ని 15 నిముషాల్లోనే పూర్తి చేశారంటే ఆ దొంగలు ఎంత అనుభవజ్ఞులో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో ఈ చోరీకి పాల్పడ్డారు. ముగ్గురు దుండుగులు చోరీ చేసినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు నిర్ధారించారు.

మోగిన అలారం

దొంగలు పడ్డ వెంటనే ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అలారం మోగింది. వెంటనే అక్కడి నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సమాచారం అందింది. అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, నాలుగో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డితోపాటు నగరంలోని సీఐలు రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్.. సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. అప్పటికే దుండగులు కారులో పరారయ్యారు. దొంగలు మూడు, నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది.



సీసీ కెమెరాకు బ్లాక్ స్ప్రే కొట్టిన దృశ్యం



దొంగలు కత్తిరించిన ఏటీఎం యంత్రభాగం

కర్ణాటకలో పట్టివేత?

ఏటీఎం చోరీకి పాల్పడిన ఇద్దరు.. పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. ఓ దొంగ పరారవగా.. అతడి కోసం పోలీసు బృందాలు అన్వేషిస్తున్నాయి. దొంగలు వాడిన వాహన లొకేషన్‌ను పోలీసులు టోల్‌గేట్లలో ఫాస్టాగ్ ఆధారంగా పట్టేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందేసరికి ఆ వాహనం కర్ణాటకలోని తుమకూరు సమీపంలోని దావనగెరికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ.. కర్ణాటక పోలీసులతో మాట్లాడారు. ఆ సందర్భంలో ఓ పోలీసు వాహనాన్ని దొంగలు ఢీకొట్టారు. ఇందులో ఎవరికీ ఏమీ కాలేదు. అనంతరం బాగల్‌కోట సమీపంలో ఇద్దరు దొంగలను పట్టేశారని సమాచారం. దొంగలది హరియాణా రాష్ట్రంలోని మేవాడ్ అని సమాచారం. చోరీలు చేసేందుకు వారు విమానాల్లో వస్తారని పోలీసుల ద్వారా తెలుస్తోంది. ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ జరగడంతో పోలీసు గస్తీపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

దుర్గమ్మకు బోనాలు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం, ఆగస్టు 4: ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం పట్టణంలోని దుర్గమ్మదేవికి భక్తులు బోనాలు సమర్పించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మహిళలు చౌడేశ్వరి దేవి కట్ట నుంచి బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ అలయానికి వెళ్లారు. బోనాలను అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఇందిరానగర్ వాసులు బాలెం ఓబుళేశు, గంగాధర్, చంద్ర పాల్గొన్నారు.

దొరిగల్లులో గ్రామదేవతలకు...


బోనాలు సమర్పించడానికి యలవ గంపలతో వెళ్తున్న గ్రామస్థులు

ముదిగుబ్బ, ఆగస్టు4: మండల పరిధిలోని దొరిగల్లు గ్రామంలో గ్రామదేవతలు గంగమ్మ, పెద్దమ్మకు గ్రామప్రజల ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతులు, బోనాల కార్యక్రమం నిర్వహించారు. మహిళలు జ్యోతులు, బోనాలను యలవగంపల్లో పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. అలాగే పొట్టేళ్ల బలిచ్చారు. మహిళలు ఒడిబియ్యం, గాజులు, పూలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఫోన్‌కాల్స్‌పై సీఐ ఆరా

గాండ్లపెంట, ఆగస్టు 4: అప్పులు చెల్లించాలంటూ మండలపరిధి లోని వద్దిపల్లి, గాండ్లపెంట తదితర గ్రామాల ప్రజలకు అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, బాధితులు వాపోతున్న విషయం విదితమే. దీనిపై కదిరిరూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం గాండ్లపెంట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.... సర్పంచ్ రహంతుల్లాను, ఇతర బాధితులను అడిగి విచారించారు. ఫోన్ కాల్స్ రావడం వాస్తవమేనని వారు తెలిపారు. డబ్బులు చెల్లించాలని బెదిరింపులతో నానా దుర్భాషలాడుతున్నారని బాధితులు సీఐ వద్ద మొరపెట్టుకున్నారు. మరోమారు ఫోన్‌కాల్స్ వస్తే వారి నెంబర్లను పోలీస్ స్టేషన్‌లో అందించాలని సీఐ సూచించారు.

వయనాడ్ బాధితులకు సాయం

బత్తలపల్లి, ఆగస్టు4: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2001లో పదో తరగతి చదివిన విద్యార్థులు కేరళలోని వరద బాధితులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కేక్ కట్ చేసి, ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా ఆర్థికసాయం పంపినట్లు తెలిపారు.

జ్యువెలరీ వ్యాపారుల అభివృద్ధికి కృషి

- కమిటీ అధ్యక్షకార్యదర్శులు


మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు ఖలీల్ రెహమాన్

ధర్మవరం, ఆగస్టు 4: జ్యువెలరీ వ్యాపారుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని జ్యువెలరీ వ్యాపారుల పట్టణ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ రెహమాన్, కార్యదర్శి కెహెచ్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. స్థానిక పీఆర్‌టీ లోని షాదీమహల్‌లో ఆదివారం జ్యువెలరీ వ్యాపారుల సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షకార్యదర్శులుగా ఖలీల్ రెహమాన్, కేహెచ్‌ప్రకాశ్‌రావును ఎంపికచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జ్యువెలరీ వ్యాపారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, వారి అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో జ్యువెలర్స్ కమిటీ మాజీ అధ్యక్షుడు రవూఫ్, సభ్యులు శశాంక్, మురళి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, కరాటే మాస్టర్లు

ధర్మవరం, ఆగస్టు 4: కరాటేతోనే ఆత్మరక్షణ ఉంటుందని కరాటే అకాడమీ మాస్టర్ గట్టు నాగరాజు, రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సి పల్ బాలుర ఉన్నతపాఠశాలలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, బైమూతక రమణ హాజరయ్యారు. కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సహంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, ఆగస్టు 4: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళా శాల క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. థం డర్స్, ఫైటర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో థండర్స్‌జట్టు 133 పరుగులు చేసి విజయం సాధించింది. ఆది 44, రాము 36 పరుగులతో రాణించారు. అదేవిధంగా అండర్ -14, 16 మధ్య జరిగిన మ్యాచ్‌లో 16 పరుగులతో అండర్ - 16 జట్టు విజయం సాధించింది. విజేతలను సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 4: పట్టణంలోని తారకరామాపురానికి చెందిన మాదాపురం మహేశ్(24) అనే యువకుడు శనివారం రాత్రి గుట్ట కిందపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. మాదాపురం మహేశ్ తండ్రి క్రిష్ణమూర్తి ఏడేళ్ల క్రితం మృతిచెందా డు. మహేశ్, తల్లి రాజేశ్వరి ఇద్దరు కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. అయి తే మహేశ్ మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఉండేవాడు. చివరికి జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విష యం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీ లించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు.



ధర్మవరంలో ప్రత్యేక అలంకరణలో కొత్తపేట చౌడేశ్వరీదేవి, తొగటవీధి శాంతకళా చౌడేశ్వరీదేవి


తొగటవీధిలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు


పార్థసారథి నగర్‌లో...

వైభవంగా చౌడేశ్వరీమాత జయంతి

ధర్మవరం, ఆగస్టు 4: పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ఆదివారం అమ్మవారి జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. కొత్తపేటలోని చౌడేశ్వరీదేవికి అర్చకులు ఉదయం వివిధ అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాల తో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తొగటవీధిలోని శాంతకళ చౌడేశ్వ రీదేవిని పట్టువస్త్రాలు, వేపాకులతో అలంకరించారు. వందమంది మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే పార్థసారధి నగర్‌లో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు.

కదిరి అర్బన్: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న చౌడేశ్వరీ ఆలయంలో ఉదయం 5.30గంటలకు మహాగణపతి పూజ, పంచామృత అభిషేకం, రుద్రాభిషే కం చేశారు. 11గంటలకు ఉయ్యాలోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య లో దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేపట్టారు.

నంబులపూలకుంట/ఓబుళదేవరచెరువు/కదిరి(అమడగూరు): మండలకేంద్రమైన నంబులపూలకుంటతోపాటు పీ కొత్తపల్లి, పెడబల్లి గ్రా మాల్లో చౌడేశ్వరీదేవికి భక్తులు ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో బోనాలు సమ ర్పించారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలంలోని అల్లాపల్లి పంచాయతీ చౌడంపల్లిలో చౌడేశ్వరికి అర్చకులు శివరాం ప్రత్యేక పూజలు చేశారు. అమడగూరు చౌడేశ్వరీ ఆలయంలో ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల య కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, 16 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు.

తనకల్లు: దేశాయి రెడ్ల ఆడబిడ్డగా చౌడేశ్వరీ దేవి ప్రసిద్ధి. దీంతో మండలకేం ద్రంలో దేశాయి రెడ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాలు చేశారు. అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


ఎన్పీకుంటలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


కదిరిలో అలంకరణలో చౌడేశ్వరీదేవి


పి కొత్తపల్లిలో చౌడేశ్వరీదేవి


ఓబుళదేవరచెరువులో...


తనకల్లులో...


అమడగూరులో...

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 4: ఏస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆదివారం మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఇనగలూరు లక్ష్మణ, నాగేళ్ల బావన్న, యల్లమరాజు, కత్తి ఆనంద్ మాట్లాడుతూ మాదిగ చిరకాల స్వప్నం ఎస్సీవర్గీకరణ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, ఎర్రదొడ్డెప్ప, పలక గంగన్న, శ్రీనివాసులు, కదిరప్ప, నరసింహులు, చౌడంపల్లి రామాంజి, వై రామాంజి, సర్వేయర్ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు పీరు ఉత్సవం


ఉరుసుపీరును ఊరేగిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఆగస్టు 4: మండలంలోని గౌకనపేట, జౌకల గ్రామాల్లో ఆది వారం ఉరుసుపీరు ఊరేగింపు నిర్వహించారు. మొహరం సంద ర్భంగా చావిడిలో ఉరుసు పీరును కొలువుదీర్చారు. శనివారం రాత్రి అగ్నిగుండం వెలిగించి అలావ్ తొక్కారు. ఉరుసుపీరును ఆదివా రం గ్రామంల్లో ఊరేగించారు. భక్త లు చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం జలధికి తరలించారు.

నల్లమాడ : మండలంలోని నల్లశింగయ్యగారిపల్లి, ఎన్ బండ వాండ్లపల్లిల్లో ఆదివారం పీర్ల జలధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొహరంసందర్భంగా శనివారం రాత్రి పీర్లను ఆయా గ్రామాల్లో ఊరే గించారు. భక్తులు చక్కెర చదివిం పులు చేశారు. ఆదివారం మధ్యాహ్నం అగ్నిగుండం వద్ద అల్లావ్ తొక్కారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.


ఎన్ బండవాండ్లపల్లిలో అలావ్ తొక్కుతున్న గ్రామస్థులు

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో

నిబంధనల ఉల్లంఘన


వేపరాల గ్రామంలో రోడ్డు పక్కనే నాటిన విద్యుత్ స్తంభం, కనీసం ఐదు అడుగుల గుంత తీయకుండా నాటిన వైనం

గాండ్లపెంట, ఆగస్టు 4: మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు నాటుతున్నారుకానీ నిబంధనలను ఉల్లంఘస్తున్నారని రైతులు, గ్రామస్థులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా పలు పంచాయ తీల్లో గ్రామాలకు 24గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి ఆర్‌డీఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు నాటి, వైర్లు లాగుతున్నారు. నిబంధనల ప్రయారం విద్యుత్ స్తంభాలను ఐదుఅడుగుల లోతు గుంతతీసి నాటాల్సి ఉంది. అయితే నిబంధనలు పాటిం చకుండా రహదారి పక్కనున్న గుంతల్లో, చెరువు కట్టల్లో, మరవల్లో విద్యుత్ స్తంభాల నాటు తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మల్లమీదపల్లి, వేపరాల, కటారుపల్లి, తుమ్మలబైలు గ్రామాల్లో రోడ్డుపక్కన తీసిన గుంతల్లో నాటడంపై గ్రామస్థులు మండిపడుతున్నా. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ పనులు జరగుతున్నాయని విమర్శిస్తున్నారు. తూతూ మంత్రంగా పనులు చేసి, బిల్లులు చేసుకునేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నారని అంటున్నారు. నిబంధనలు పాటించి పనులు చేయాలని, వీటిపై సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

ఎనిమిదో వార్డులో టీడీపీ నాయకుల పర్యటన


మురుగు కాలువను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 4: పట్టణంలోని పలు వార్డులలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పలు వార్డులలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎనిమిదో వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి తదిత రులు పర్యటించి మురుగుకాలువలను పరిశీలించారు. మురుగుకాలువ లు చెత్తాచెదారంతో నిండి ఉండడంతో మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోందని, దీంతో అసౌకర్యంగా ఉందని ప్రజలు వారికి తెలియజేశారు. దీంతో నాయకులు మున్సిపల్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, మురుగు కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

తండాలో తాగునీటికి కటకట

అవస్థలు పడుతున్న గ్రామస్థులు


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ధర్మవరంరూరల్, ఆగస్టు4: మా గొంతెండుతోంది... మా తాగునీటి కష్టాలు తీర్చండంటూ నడిమిగడ్డపల్లి తూర్పుతండావాసులు వేడుకుంటు న్నారు. మండలంలోని నడిమిగడ్డపల్లి తూర్పుతండా గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురైంది. పైగా ఆ బోరులో నీరు ఇంకిపోవడంతో తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుని పట్టుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఒక్కబోరులో కూడా తాగునీరు రాకపోవడంతో తామెలా జీవించేదని మండి పడుతున్నారు. ఇలా ఎన్నిరోజులు తాగునీటి ట్యాంకర్ వద్ద పట్టుకో వాలని ప్రశ్నిస్తున్నారు. అది కూడా ప్రతి కుటుంబం కేవలం రోజుకు నా లుగైదు బిందెలు పట్టుకోవాలని మళ్లీ వంతు రాదని మహిళలు వాపోయా రు. సమీప తోటల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు.పశువులకు కూడా నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతో తాగు నీరు లేక పశువులను అమ్ము కోవాల్సి వస్తోందని రైతులు వా పోయారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన తాగునీటి బోరు

కోరిన కోర్కెలు తీర్చే

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి

- శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


పాలపాదిన్నె ఆలయ ఆవరణం, (ఇన్‌సెట్‌లో) ఆంజనేయస్వామి

నల్లచెరువు, ఆగస్టు 4: కోరిన కోర్కెలు తీర్చే కరుణామయుడిగా పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి విరాజిల్లుతున్నాడు. శ్రావణమాసోత్సవాలకు ఆలయం లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కదిరి ప్రాంతంలో ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం తరువాత నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామికి అంత టి ప్రాముఖ్యత ఉంది. ప్రతి శని, మంగళవారాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించు కుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఆలయ ఈఓ రవీంద్ర రాజు ఆధ్వర్యంలో భక్తులకు మౌలిక వసతులతో పాటు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. అయితే ఈయేడాది ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఉచిత దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి శనివారం దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చడం ఆనవాయితీ. ఈనెల 24న మూడో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ విశ్రాంతి ఉద్యోగులు, ఉద్యోగుల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ప్రతి శనివారం ఆలయంలో భజనలు, కోలాటం, ధార్మిక, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు తెలిపారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవ విగ్రహం ఊరేగిస్తామన్నారు. కదిరినుంచి 14 కిలోమీటర్లలో నల్లచెరువు పాత రైల్వేస్టేషన్ మీదుగా పాలపాటిదిన్నె ఆలయం ఉంది. నల్లచెరువునుంచి పాలపాటి దిన్నె మూడు కిలోమీటర్లు. రోడ్డు సౌకర్యం ఉంది. ఆర్టీసీతోపాటు ప్రయివేటు వాహనాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి.

పావగడలో శ్రావణ సందడి


- నేటి నుంచి ప్రత్యేక పూజలు

పావగడ, ఆగస్టు 4 : అనారోగ్యం, అప్పుల బాధలతో విలవిలలాడే బాధితులకు శనీశ్వరుడు కరుణించి విముక్తి చేస్తాడు. శనీశ్వరుడిని భక్తిపూర్వకంగా కొలిస్తే మనిషికి అంటుకున్న ఎలాంటి శని నుంచైనా ఉపశమనం లభిస్తుందని భక్తుల అపార నమ్మకం. దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన తుమకూరుజిల్లా పావగడ శనీశ్వరుడికి శ్రావణమాసంలో విశేషపూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 5నుంచి సెప్టెంబర్ 2 వరకు శ్రావణమాస ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా జరుగు తున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. ఈనెల 10నుంచి మొదటి శ్రావణ శనివారం 16నుంచి శ్రావణ శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతం, 24న తృతీయ శ్రావణశనివారం, 31న నాలుగో శనివారం జ్యేష్ఠదేవి సమేతుడైన శనీశ్వరుడి పల్లకి ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు.

శనీశ్వరుని విశిష్టత

కాకి వాహనుడైన శనేశ్వరుడికి ఎంతో ప్రీతిపాత్రమైన నల్లగుడ్డ, నల్లనూనె తైలం, ఆలయం ముందున్న అగ్నిగుండంలోకి వేసి తొమ్మిదిసార్లు ప్రదక్షణలు చేస్తే నవ గ్రహాల శని తొలగిపోయాని భక్తుల నమ్మకం. శ్రావణమాసంలో ఆంధ్ర, కర్ణాటక భక్తులు విశేషంగా విచ్చేసి పూజలు నిర్వహిస్తారు. పావగడ శనీశ్వర ఆలయం కన్నా ముందే 108 బీజాక్షరాలతో రాతిపై చెక్కిన శీతలాంబ ప్రసిద్ధి పొందింది.

మాన్యం గుత్త చెల్లింపుపై వివాదం


ఎస్ఐని కలిసిన దళితులు

కదిరి, ఆగస్టు 4: తలుపుల మండలంలోని గంజివారిపల్లిలో వెలసిన ఓబు లేశ్వరస్వామి దేవస్థానం మాన్యం భూమికి గుత్త చెల్లించాలని, లేని పక్షంలో బహిరంగ వేలం రద్దుపరిచి తిరిగి వేలం నిర్వహిస్తామని ఈఓ పీ రవీంద్రరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గంజివారిపల్లి పొలంలోని సర్వేనెంబర్ 901లో 66ఎకరాల భూమిని గత సంవత్సరం మూడేళ్ల కాపరిమితికి వేలం వేశా రు. వేలం దక్కించుకున్న పీ పాపులమ్మ మొదటి సంవత్సరం గుత్త రూ.3. 05 వేలు చెల్లించారు. రెండో సంవత్సరం గుత్త ఈ యేడాది మార్చ 31లోగా చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు చెల్లించలేదని, లీజుదారులకు మూడు నోటీసులు పంపినా ఇంతవరకు స్పందించలేదని ఈఓ పేర్కొన్నారు. తక్షణం గుత్త చెల్లించకపోతే బహిరంగ వేలం రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు. అయితే ఈ వివాదం ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వేపమాను పేట సర్పంచ్ మల్లికార్జునతోపాటు పలువురు దళితులు పోలీస్ స్టేషన్‌కు వెళా రు. అలాగే దేవదాయ శాఖ ఈఓ కూడా వెళ్లారు. ఈ సందర్భంగా ఈఓ మా ట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు వేలం నిర్వహించామని, రెండో సంవత్స రం గుత్త చెల్లించాలన్నారు. దళితులు మాట్లాడుతూ... మాన్యం భూమిని గతం లో 45కుటుంబాలు సాగుచేసుకునేవారని, వారి తరఫున ఎస్సీ కార్పొరేషన్ గతం లో డబ్బులు చెల్లించిందన్నారు. దేవదాయ శాఖ కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఉత్తర్వు ల మేరకు ఆ భూమిని గత సంవత్సరం వేలం వేశారని, వేలంలో దళితులం దరూ ఒక్కటిగా ఉండి ఒకరి పేరుమీద వేలం దక్కించుకున్నామని తెలిపారు. అయితే ఇంతవరకు ఆ భూమినే చూపకుండా గుత్తలు చెల్లించాలంటే ఎలా ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని ఎస్ఐని కోరారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్య క్రమంలో దళితులు వెంకటరమణ, విజయ్ కుమార్, రామాంజులు, దొడ్డెప్ప, గంగన్న, ఓబులప్ప, రామచంద్ర, నరసింహులు, గంగరాజు, గుర్రయ్యలున్నారు.



దేమకేతేపల్లిలో గాజులతో అలంకరణలో చౌడేశ్వరీమాత



గోరంట్లలో ముస్తాబైన అమ్మవారు..

పూజలు అందుకుంటున్న ఏటి గంగమ్మ దేవత



పాహిమాం.. చౌడేశ్వరీ..!

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి జయంతి
- బోనాలు సమర్పించిన మహిళలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 4 : చౌడేశ్వరి జయంతిని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సత్తెమ్మ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. తొగటవీరక్షత్రియ కమిటీ అధ్యక్షులు సీసీ హరి, ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. చౌడేశ్వరీ అమ్మవారికి ప్రదక్షణల అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని చౌడేశ్వరీ అమ్మవారికి ఎంపీ బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోరంట్ల : పట్టణంలోని వీవర్సుకాలనీ, చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసం అమావాస్యరోజున అమ్మవారి జయంతి జరుపుకోవడం ఆనవాయితీ. వీవర్సుకాలనీలో దేవాంగులు అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు నాగభూషణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకం, మహామంగళహారతి, అన్నదానం నిర్వహించారు.

చిలమత్తూరు : భక్తుల ఆరాధ్య మాతగా వెలుగొందుతున్న చౌడేశ్వరీ మాత జయంతిని భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని దేమకేతేపల్లి, కోడూరు గ్రామాల్లో వెలసిన అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు చేశారు. అమ్మవారిని శాంతి స్వరూపిణిగా అలంకరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దేమకేతేపల్లిలో అమ్మవారి మూలవిరాట్టుని పవిత్రమైన గాజులతో అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంది. మండల కేంద్రానికి సమీపంలో కుషావతి నది ఒడ్డున వెలసిన ఏటి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



వీవర్స్ కాలనీలో అలంకరణలో అమ్మవారు



సోమందేపల్లిలో బోనాలతో వెళ్తున్న భక్తులు



అమ్మవారి ఆలయంలో కేక్‌కట్‌చేస్తున్న కమిటీ సభ్యులు



హిందూపురం చౌడేశ్వరీ మాత బోనాలతో మహిళలు

వేడుకల్లో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ తదితరులు





సోమందేపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రేషన్ షాపుల ప్రారంభం

మడకశిరటౌన్, ఆగస్టు 4 : రేషన్‌షాపుల ద్వారా పేదలకు నిత్యావసరాలు అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు పటిష్ట చర్యలు తీసుకున్నారని, వాటిని డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నరసింహరాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని నాలుగో రేషన్‌షాపును ప్రారంభించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్లు ఉమాశంకర్, ప్రభావతమ్మ, శీనప్ప, పట్టణ యువత అధ్యక్షులు తిమ్మరాజు, నాయకులు బాబు, జుంజప్ప, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఓబన్న, తదితరులు ఉన్నారు.

మడకశిర రూరల్: రాష్ట్రముఖ్యమంతి చంద్రబాబునాయుడు పేదలకు అందిస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీచేయాలని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలో కొండంపల్లి గ్రామంలో రేషన్ పంపిణీ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘురాం, రమేశ్, కరియన్న, గోపాలప్ప, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చిన ఎన్టీఆర్

మడకశిర(అమరాపురం): పేదలకు అన్నం రుచి చూపించిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారాక రామారావుదేనని అమరాపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్.గణేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం నూతన డీలర్‌షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సాధికార కమిటీ సభ్యుడు మంజునాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నప్ప, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి

- శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



పాలపాదిన్నె ఆలయ ఆవరణం, (ఇన్‌సెట్‌లో) ఆంజనేయస్వామి

నల్లచెరువు, ఆగస్టు 4: కోరిన కోర్కెలు తీర్చే కరుణామయుడిగా పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి విరాజిల్లుతున్నాడు. శ్రావణమాసోత్సవాలకు ఆలయం లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కదిరి ప్రాంతంలో ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం తరువాత నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామికి అంత టి ప్రాముఖ్యత ఉంది. ప్రతి శని, మంగళవారాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఆలయ ఈఓ రవీంద్ర రాజు ఆధ్వర్యంలో భక్తులకు మౌలిక వసతులతో పాటు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. అయితే ఈయేడాది ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఉచిత దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి శనివారం దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చడం ఆనవాయితీ. ఈనెల 24న మూడో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ విశ్రాంతి ఉద్యోగులు, ఉద్యోగుల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ప్రతి శనివారం ఆలయంలో భజనలు, కోలాటం, ధార్మిక, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు తెలిపారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవ విగ్రహం ఊరేగిస్తామన్నారు.

పాత రహదారినే కొనసాగించాలి

పెనుకొండ టౌన్, ఆగస్టు 4: పూర్వం నుంచి రాకపోకలు కొనసాగిస్తున్న రహదారినే కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొండాపురం, మంగాపురం, కోనాపురం వెళ్లే రహదారివద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలేకుండా రోడ్డు మార్పుకు అనుమతులిస్తూ ప్రమాదాలకు కారణమైన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్‌చేసి పాత రోడ్డును కొనసాగించాలని నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు సర్ది చెప్పి రాస్తారోకోను విరమింపేశారు. పెద్దన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



రాస్తారోకో చేస్తున్న కమిటీ సభ్యులు

మండలమీట్‌కు అధికారుల డుమ్మా

పెనుకొండ రూరల్, ఆగస్టు 4 : రొద్దం మండలంలోని మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలమీట్‌కు పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. ఆదివారం ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు హాజరయ్యారు. అయితే విద్యుత్‌శాఖ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రాకపోవడంతో సమావేశం ఎందుకని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా గ్రామాల్లో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు వాపోయారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసీడీఎస్ అధికారులకు నోటీసులు పంపినట్లు ఎంపీడీఓ, ఏఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ పద్మ, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హాట్ సీట్..!

- విద్యుత్ శాఖలో డీఈఈ పోస్టుకు తీవ్ర పోటీ
- ఉన్నతాధికారులతో పైరవీలు
- నాయకుల చుట్టూ ప్రదక్షిణ
- జోరందుకున్న సిఫార్సులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 4: విద్యుత్ శాఖ డీఈఈ పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఆ స్థానం కోసం నువ్వా నేనా అనే రీతిలో ఒకరికి మించి ఒకరు పోటాపోటీగా ప్రయత్నం చేయడం చర్చనీయాంశమయ్యింది. కొందరు అధికారులు ఆ సీటు కోసం మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల వద్దకు వెళ్తున్నారని ఆ శాఖలోనే గుప్పుమంటోంది. ఇందు కోసం లక్షలు వెచ్చించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. హిందూపురం డీఈఈ స్థానం పోటీపై విద్యుత్ శాఖ కార్యాలయంలో చర్చలు జోరందుకున్నాయి.



ఎందుకంత పోటీ?

హిందూపురం డివిజన్‌లో 12 మండలాలు ఉన్నాయి. అదే విధంగా హిందూపురం, హిందూపురం రూరల్, పెనుకొండ, మడకశిర 4 సబ్ డివిజన్‌లు ఉన్నాయి. ముఖ్యంగా హిందూపురం ప్రాంతంలో ఆదాయ వనరులు సమకూర్చే తూమకుంట పారిశ్రామిక వాడ, గోళ్ళాపురం, హిందూపురం చుట్టుపక్కల స్టీల్ ప్లాంట్‌లు, ఫ్యాబ్రికేషన్‌లు టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఉన్నాయి. అదే విధంగా పెనుకొండలో అతి పెద్ద కార్ల దిగ్గజం కియా కార్ల పరిశ్రమ, దాని అనుబంధ పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వీటితో పాటు పాలసముద్రం వద్ద నాసిన్, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వాటి నుంచి నెలకు రూ. కోట్లలో విద్యుత్ శాఖకు ఆదాయం సమకూరుతుంది. దీంతో టార్గెట్ చాలా సులువుగా చేరుకోవచ్చు. రాజకీయ నాయకుల ఒత్తిడి ఉండదు. డివిజన్‌కు డీఈఈనే ఉన్నతాధికారి.

పోటాపోటీ

డీఈఈగా ప్రస్తుతం ఉన్న అధికారి రాష్ట్రం విడిపోయిన సమయంలో తెలంగాణకు బదిలీ అయ్యారు. ఇప్పుడు మరలా ఆంధ్రకు వచ్చారు. వచ్చీ రాగానే హిందూపురం డీఈఈగా రావాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే అతను గతంలో ఇక్కడ ఏడీఈగా కూడా పని చేశాడని తెలుస్తోంది. ప్రసుత్తం ఉన్న డీఈఈ ఇక్కడే ఉండాలని తీర్మానం చేసినట్లు సమాచారం. అయితే మరో అధికారి మాత్రం ఆస్థానం కోసం సీఎండీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో డీఈఈ ఎవరనేది తేలనుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

బహుజన చైతన్య వేదిక సంబరాలు



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న చైతన్యవేదిక సభ్యులు

పెనుకొండ, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అత్యున్నత న్యాయస్థానం తీర్పునివ్వడంపై బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి వేదిక సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలువేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా చైతన్యవేదిక వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ ఇది 30ఏళ్ల ఒక జాతి రిజర్వేషన్ కోసం పోరాటంచేసి సాధించుకున్న విజయమన్నారు. సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రొద్దం బాబు ప్రసాద్, రామాంజినప్ప, రవికుమార్, రంగేపల్లి నాగరాజు, చల్లాపల్లి ఈశ్వర్, హనుమంతు, లోకేష్, రామాంజినేయులు, నరసింహులు, బహుజన వేదిక సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

అనంతపురం విద్య, ఆగస్టు 4: అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్కూళ్లలో టీచర్ల కొరత ఉందని, వెంటనే బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం మున్సిపల్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్ మాట్లాడుతూ ఆగస్టు నెల వచ్చినా టీచర్ల సర్దుబాటు చేయకపోవడం దారుణం అన్నారు. వెంటనే బదిలీలు చేపట్టి టీచర్ల సమస్య తీర్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సైతం వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీచర్ల రేషనలైజేషన్ నిర్వహించి విద్యార్థులు ఎక్కువ ఉన్న స్కూళ్లకు పోస్టులను సర్దుబాటుచేయాలన్నారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులలో ఉన్న వారి విల్లింగ్ ఆధారంగా స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేయాలని కోరారు. తెలుగు, హిందీ సబ్జెక్టుల ఉద్యోగోన్నతులు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పావగడలో శ్రావణ సందడి

- నేటి నుంచి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరుడు

శీతలాంబ అమ్మవారు



పావగడ, ఆగస్టు 4 : అనారోగ్యం, అప్పుల బాధలతో విలవిలలాడే బాధితులకు శనీశ్వరుడు కరుణించి విముక్తి చేస్తాడు. శనీశ్వరుడిని భక్తిపూర్వకంగా కొలిస్తే మనిషికి అంటుకున్న ఎలాంటి శని నుంచైనా ఉపశమనం లభిస్తుందని భక్తుల అపార నమ్మకం. దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన తుమకూరుజిల్లా పావగడ శనీశ్వరుడికి శ్రావణమాసంలో విశేషపూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 5నుంచి సెప్టెంబర్ 2 వరకు శ్రావణమాస ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. ఈనెల 10నుంచి మొదటి శ్రావణ శనివారం 16నుంచి శ్రావణశుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతం, 24న తృతీయ శ్రావణశనివారం, 31న నాలుగో శనివారం జ్యేష్టదేవి సమేతుడైన శనీశ్వరుడి పల్లకి ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు.

శనీశ్వరుని విశిష్టత

కాకి వాహనుడైన శనేశ్వరుడికి ఎంతో ప్రీతిపాత్రమైన నల్లగుడ్డ, నల్లనూనె తైలం, ఆలయం ముందున్న అగ్నిగుండంలోకి వేసి తొమ్మిదిసార్లు ప్రదక్షణలు చేస్తే నవగ్రహాల శని తొలగిపోయాని భక్తుల నమ్మకం. శ్రావణమాసంలో ఆంధ్ర, కర్ణాటక భక్తులు విశేషంగా విచ్చేసి పూజలు నిర్వహిస్తారు.

శీతలాంబ చరిత్ర

పావగడ శనీశ్వర ఆలయంకన్నా ముందే 108 బీజాక్షరాలతో రాతిపై చెక్కిన శీతలాంబ ప్రసిద్ధి పొందింది. పెళ్లికానివారు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేస్తే మూడు నెలల్లో కల్యాణ భాగ్యం కలుగుతుందని విశేష నమ్మకం. శనీశ్వరుడి కంటే ముందే శీతలాంబను ప్రతిష్ఠించినా ఘనత పొందింది మాత్రం శనేశ్వరుడని ఆలయ అర్చకులు అభిప్రాయపడుతున్నారు. ఇంతటి మహిమగల శనేశ్వరుడు ఏ ఒక్క ఇంటి ఇలవేల్పు దైవం కాకపోవడం మరో విశేషమని సత్యనారాయణశర్మ తెలిపారు.

ఏడుకొండల స్వామికి ఏడువారాల వ్రతం

మడకశిరటౌన్, ఆగస్టు 4 : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శ్రావణమాసంలో ఏడు శనివారాల వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, 6.30 గంటలకు గంగపూజ, 7 గంటలకు గోసావిత్రిపూజ, 8 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనం, 8.30 గంటలకు నవగ్ర హ రాదన, 10 గంటలకు సప్త మాతృకళాపూజ, 10.30 గంటలకు ఏడు కొండల స్వామివారి వ్రతం ప్రారంభమవుతుందని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు తెలిపారు. వ్రతంలో పాల్గొనాల్సిన భక్తులు బి.ఆర్.కీర్తికృష్ణ సెల్: 9490625993, బీవీ ప్రసాద్ 7337522066 నెంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పాడి ఆవుకు ప్రసవ వేదన

- గోమాతకు ప్రైవేట్ వైద్యం
- లేగదూడ మృత్యువాత

హిందూపురం, ఆగస్టు 4 : ప్రసవ వేదన ఏ జీవికైనా తప్పదు. ఇక మూగజీవాల బాధ చెప్పనలవి కానిది. గోమాత బిడ్డకు జన్మనిచ్చేకి విలవిలలాడింది. కానీ లేగ దూడ మృతి చెందడంతో రైతుకు కన్నీరే మిగిలింది. పశు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పాడిరైతు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. పరిగి మండలం ఎస్. ముద్దిరెడ్డిపల్లికి పాడిరైతుకు చెందిన పాడిఆవు శనివారం ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతోంది. ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడిని సంప్రదించగా రాకపోవడంతో, తప్పని పరిస్థితిలో ప్రైవేట్ వైద్యుడిని పిలిపించారు. ఆయన శనివారం రాత్రి గర్భంతో ఉన్న ఆవు ప్రసవం చేసేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కాకపోగా రక్తస్రావం ఎక్కువైంది. దీంతో చేసేదిలేక ఆయన వెనుదిరిగిపోయారు. పాడి రైతు ఆదివారం హిందూపురం ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకొచ్చాడు. అయితే అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడం.. వాహనంలో తరలించి ఆసుపత్రిలో ప్రసవం చేయగా అప్పటికే దూడ మృతిచెందింది. దీంతో పాడి రైతు ఓవైపు గాయాలతో ఉన్న పాడి ఆవు, మరోవైపు దూడ మృతిని చూసి బోరున విలపించాడు. కష్టపడ్డా ఫలితం లేకుండా పోయిందన్నారు. పశువులకు ప్రైవేట్ వ్యక్తులతో కాకుండా, ప్రభుత్వ వైద్యం అందు బాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు.



గాయాలతో పాడి ఆవు

నేడు మండల సర్వసభ్య సమావేశం

అగళి, ఆగస్టు 4 : అగళి మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్‌స్వామి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు సర్పంచులు మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు కాంప్లెక్స్ భవనాల వేలం

గుడిబండ, ఆగస్టు 4 : మండలపల్లి బస్టాండులో ఉన్న పంచాయతీ కాంప్లెక్స్‌లను వేలం వేయనున్నట్లు సర్పంచ్ అశ్వర్థ, పంచాయతీ కార్యదర్శి అమరేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగలవారు రూ.30వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

నేడు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గుడిబండ రెవెన్యూ తహసీల్దార్‌గా కరుణాకర్ నియమితుడయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

మనుషులు స్నేహపూర్వకంగా మెలగాలి

- బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయ బెహన్ సుగంధ



మాట్లాడుతున్న బెహన్ సుగంధ

హిందూపురం అర్బన్, ఆగస్టు 4: సమాజ శ్రేయస్సులో మీడియా పాత్ర ప్రధానమని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బెహన్ సుగంధ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణపేటలోని ఓంశాతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. విశ్వమానవులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. విలేకరులు ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానం అలవరుచుకోవాలన్నారు. విలేకరులకు రాఖీలు కట్టి సోదరభావం చాటిచెప్పారు.

ముగిసిన యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ



బహుమతులు అందజేస్తున్న యూటీఎఫ్ కన్వీనర్ నరేష్ కుమార్

పెనుకొండ, ఆగస్టు 4 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో రొద్దం ఎన్‌పీకుంట జట్లు విజేతగా నిలిచినట్లు టోర్నీ కన్వీనర్ నరేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం మొదటి మ్యాచ్, పుట్టపర్తి, రొద్దం జట్లు మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పుట్టపర్తి జట్టు నిర్ణీత 12ఓవర్లలో 83పరుగులు చేశారు. అనంతరం రొద్దం జట్టు 8ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా గంగాధర్ ఎంపికయ్యాడు. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్ ఎన్‌పీకుంట, మడకశిర జట్ల మధ్య జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మడకశిర 12ఓవర్లలో 79పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎన్‌పీ కుంట జట్టు మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా యోగి ఎంపికయ్యాడు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, గంగాధర్, శివయ్య, ఆదిజినేష్, మారుతి, శేషాద్రి, నరేష్, బాబు, కాశీ, వంశీ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో శ్రమదానం

చిలమత్తూరు, ఆగస్టు 4: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, రక్షా అకాడమీ హెడ్ ట్రైనింగ్ రిక్రూట్‌మెంట్ అధికారి కోల్ కిరిట్ క్రిష్టన్ నాయర్ పేర్కొన్నారు. ఆదివారం రక్షా అకాడమీ శిక్షకులతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర పరిసరాలను శ్రమదానం ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా నాయర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఆసుపత్రిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తమ సంస్థ ఆధ్వర్యంలో శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, సిబ్బంది పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యురాలు తేజశ్విని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రక్షా అకాడమీ ప్రతినిధులు నవీన్ త్యాగి తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న కమిటీ సభ్యులు